ఎన్నికలు ఎప్పుడొచ్చినా సిద్ధం

- పల్లె సమరానికి సమాయత్తమవుతున్న అధికార గణం
- ఓటరు జాబితా షెడ్యూల్ విడుదల
- వార్డుల లెక్కలు, బ్యాలెట్ బాక్సులు సమకూర్చుకునే పనిలో సిబ్బంది



పెద్దవేడు గ్రామ పంచాయతీ కార్యాలయం

షాబాద్: గ్రామ పంచాయతీలకు 8 నెలలుగా సర్పంచ్‌లు లేకపోవడంతో ప్రత్యేక అధికారుల పాలనలో అవి కొనసాగుతున్నాయి. ఇప్పటికే శాసనసభ, పార్లమెంట్, ఎమ్మెల్సీ ఎన్నికలు పూర్తయ్యాయి. ఇప్పుడు పంచాయతీల వంతు వచ్చింది. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించే పనిలో రాష్ట్ర ఎన్నికల సంఘం సిద్ధమవుతుంది. కులగణన తర్వాత ఎన్నికలు ఉంటాయనే ఊహాగానాలు వస్తున్నాయి. ఎప్పుడు ఎన్నికలు నిర్వహించాల్సి వచ్చినా సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ఉన్నతాధికారులు ఆదేశించారు. దీంతో అధికార యంత్రాంగం ఎన్నికల పనుల్లో నిమగ్నమైంది.

బ్యాలెట్ బాక్సులు సిద్ధం

◆ అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల మాదిరిగా ఈవీఎం విధానం కాకుండా పంచాయతీ ఎన్నికలు బ్యాలెట్ ఓటింగ్ విధానం ద్వారా నిర్వహించనున్న నేపథ్యంలో అందుకు కావాల్సిన ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ప్రధానంగా బ్యాలెట్ బాక్సులు సమకూర్చుకునే పనిలో ఉన్నారు. గత ఎన్నికల వివరాల ప్రకారం 4,838 వార్డులు ఉండగా, వార్డుల సంఖ్య స్థానికంగా పెరిగిన ఓటు బ్యాంకుపై ఆధారపడి ఉంటుంది. కొత్త వార్డుల ఏర్పాటు విషయం పక్కన పెడితే ప్రస్తుతం ఉన్న లెక్కల ప్రకారం అదనంగా 20 శాతం బ్యాలెట్ బాక్సులు సమకూర్చుకోవాల్సి ఉంటుంది. గతంలో మాదిరిగానే ఈసారి జిల్లా వ్యాప్తంగా విభజించి ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. మొత్తం 585 గ్రామ పంచాయతీల్లో స్థానిక పరిస్థితులు, శాంతి భద్రతలు, ఎన్నికల సిబ్బంది, అధికారుల పర్యవేక్షణ ఇతర అంశాలను పరిగణలోకి తీసుకుంటారు.

ఓటరు జాబితా సిద్ధం చేయాలని ఆదేశాలు

◆ పంచాయతీ అధికారులు ఓటర్ల జాబితా సిద్ధం చేయాలని ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేసింది. పంచాయతీల్లోని వార్డుల వారీగా జాబితా తయారు చేసేందుకు కార్యదర్శులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు. మేజర్ పంచాయతీ అయితే వార్డుకు 625 ఓట్లు కేటాయించనున్నారు. పంచాయతీ పరిధిలోని ఓటర్లను ప్రతి వార్డుకు సమానంగా విభజించనున్నారు. జాబితా రూపకల్పనపై పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కూడా పూర్తయింది.

ఓటరు జాబితా షెడ్యూల్ ప్రకారం ఇలా..

- సెప్టెంబర్ 6న ఫొటోలతో కూడిన ఓటరు జాబితాలు సిద్ధం చేయాలి.
- 9న జిల్లా, 10న మండల స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి జాబితాలపై అభిప్రాయాలు స్వీకరిస్తారు.
- 7 నుంచి 13వ తేదీ వరకు పంచాయతీ నిబంధనల ప్రకారం అభ్యంతరాలు, ఓటర్ల సర్దుబాటు, తప్పులు సరిచేసుకునే అవకాశం.
- 19న డిస్పోజల్ ఆఫ్ అభ్యంతరాలు డీపీఓకు అందజేయాలి.
- 21వ తేదీన పంచాయతీల వారీగా ఓటర్ల ఫొటోలతో కూడిన తుది జాబితాను ప్రదర్శనకు ఉంచాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.

కుటుంబసభ్యులంతా ఒకే బూత్‌లో....



ఓటరు జాబితాలో ఒక కుటుంబానికి చెందిన వారందరిని ఒకే బూత్‌లో వచ్చే విధంగా సిద్ధం చేస్తున్నాం. ఇందుకోసం పంచాయతీ కార్యదర్శులు, గ్రామానికి చెందిన బీఎల్‌ఓలు గ్రామంలో ఓటర్ల వివరాలు సేకరించి సరిచేస్తున్నారు.

– అపర్ణ, ఎంపీడీఓ, షాబాద్

సమస్యలపై నిరంతర పోరాటం

ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రామస్వామి

మొయినాబాద్: పేదల సమస్యల పరిష్కారం కోసం ఏఐటీయూసీ నిరంతర పోరాటం చేస్తుందని రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు, జిల్లా అధ్యక్షుడు కె రామస్వామి పేర్కొన్నారు. ఈ నెల 23, 24న తుక్కుగూడలో నిర్వహించనున్న ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఆదివారం మొయినాబాద్ మండల కేంద్రంలో రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల వాల్‌పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా రామస్వామి మాట్లాడుతూ కార్మికుల సమస్యలపై తమ సంఘం పోరాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ, సీపీఐ మండల కార్యదర్శి కె.శ్రీనివాస్, భవన నిర్మాణ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ప్రభాకర్, దర్శన్, యాదయ్య, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న రామస్వామి తదితరులు

ఆలూరు రోడ్డు గుంతల పూడ్చివేత

చేవెళ్ల: ఆలూరు రోడ్డు గుంతలను గ్రామానికి చెందిన ఫ్రెండ్స్ హెల్పింగ్ గ్రూప్ సభ్యులు పూడ్చివేయించారు. ఈ సందర్భంగా ఆదివారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్డు మొత్తం గుంతల మయంగా మారిందని పలు మార్లు అధికారులకు, పాలకులకు చెప్పిన పట్టించుకోలేదని వాపోయారు. దీంతో ఈ రోడ్డు గుండా ఏర్పడ్డ గుంతలతో స్థానికులు, వాహనదారుల ఇబ్బందులను గుర్తించి మానవత్వ దృక్పథంతో ఆలూరు రోడ్డుపై ఏర్పడిన గుంతలకు 35 ట్రాక్టర్లతో మట్టిని పోయించి రోడ్డును చదును చేయించారు. ఇటీవల ఈ సమస్యను ఎమ్మెల్యే కాలె యాదయ్య దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఆయన లారీ మట్టిని పోయించి కొన్ని గుంతలను పూడ్చివేయించారని తెలిపారు. సుమారు రూ. 30వేల వరకు గ్రూప్ సభ్యులు ఖర్చు చేసి పనులు చేపట్టినట్లు వివరించారు. గ్రామంలోని హైస్కూల్‌వద్ద రోడ్డును బాగు చేయించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో శేఖర్, రమేశ్, రాజు, మహేశ్, నవీన్, చిన్న, నాని, పృథ్వీరాజ్, చింటూ, ప్రశాంత్, రాహుల్, శేఖర్, నర్సింలు, దప్పు రాజు, తదితరులు పాల్గొన్నారు.



రోడ్డును చదును చేయిస్తున్న గ్రూప్‌సభ్యులు

రశీదు తప్పనిసరి

17న రచ్చబండ వినాయకుని లడ్డూ వేలం

చేవెళ్ల: మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించనున్న రచ్చబండ వినాయకుని వేలంలో పాల్గొనే వారు తప్పనిసరిగా రశీదు తీసుకోవాలని చేవెళ్ల రచ్చబండ వినాయక ఉత్సవ కమిటీ ప్రకటించింది. ఈ ఏడాది నుంచి కొత్తగా ఈ రూల్ అమలు చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఉత్సవ కమిటీ, గ్రామ పెద్దలు నిర్ణయించిన విధంగా ఈ నెల 17వ తేదీన వినాయక నిమజ్జనం కార్యక్రమంలో భాగంగా ఆరోజు రాత్రి జరిగే ఈ వేలానికి ప్రత్యేకత తెలిసిందే. ఈ లడ్డూ వేలం పాట ఒక్కోసారి రాష్ట్ర స్థాయిలో, జిల్లాస్థాయిలో రూ. లక్షల్లో పలికి రికార్డులోకి వచ్చిన విషయాన్ని వారు గుర్తు చేశారు. అందుకే ఉత్సవ కమిటీ సభ్యులు నిమజ్జనం రోజున వేలం పాటలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందుగానే వేలం పాటలో పాల్గొనే భక్తులు డిపాజిట్ చేసే విధంగా చర్యలు తీసుకున్నారన్నారు. వేలం పాటలో పాల్గొనే భక్తులు ముందుగానే ఉత్సవ కమిటీ నుంచి డిపాజిట్ రశీదును పొంది పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. గ్రామ పెద్దలు, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారన్నారు. డిపాజిట్ చేసిన రూ. 5వేలు కూడా తిరిగి చెల్లించబడదని నిర్వాహకులు పేర్కొన్నారు.

ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

యాచారం: వినాయక నిమజ్జన వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలని సీఐ శంకర్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. నిమజ్జనం చేసేటప్పుడు విద్యుత్ సరఫరా, నీళ్లల్లో మునిగే సమయాల్లో భక్తులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. సాగర్, శ్రీశైలం తదితర సుదూర ప్రాంతాలకు వెళ్లేటప్పుడు ఎంత మంది వెళ్తున్నారో సమాచారం ఇస్తే బాగుంటుందని పేర్కొన్నారు.

స్వయం ఉపాధితో రాణించాలి

దామర్లపల్లి మాజీ సర్పంచ్ బోకుల లింగం, దోనూరి శంకరయ్య

షాబాద్: యువత స్వయం ఉపాధితో రాణించాలని దామర్లపల్లి మాజీ సర్పంచ్ బోకుల లింగం, వ్యాపారవేత్త దోనూరి శంకరయ్య పేర్కొన్నారు. ఆదివారం దామర్లపల్లి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని యువత స్వయం ఉపాధితో ముందుకు సాగాలన్నారు. అదే విధంగా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందించడం శుభప్రదమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ జయమ్మ వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఉపసర్పంచ్ పొన్న నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న మాజీ సర్పంచ్ బోకుల లింగం, దోనూరి శంకరయ్య తదితరులు

బీఆర్ఎస్ నాయకుడికి పితృవియోగం

ఇబ్రహీంపట్నం: ఉస్మానియా విశ్వవిద్యాలయ విద్యార్థి నాయకుడు, బీఆర్ఎస్ ఇబ్రహీంపట్నం నియోజకవర్గ నాయకుడు మంద సురేష్ తండ్రి నర్సింహ్మ అనారోగ్యంతో ఆదివారం కన్నుమూశారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి తుర్కగూడలోని సురేష్ నివాసానికి వెళ్లి నర్సింహ్మ పార్థివదేహానికి నివాళులు అర్పించారు. అయనతో పాటు జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు బుగ్గరాములు, యువజన విభాగం అధ్యక్షుడు రాజు, విద్యార్థి విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు జగదీశ్, మార్కెట్ మాజీ డైరెక్టర్ బుచ్చిరెడ్డి తదితరులు ఉన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



స్వామివారికి పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు

షాద్‌నగర్ రూరల్: పట్టణంలోని వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకొని ఆదివారం వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని ఆలయ అర్చకులు ఎంతో వైభవంగా నిర్వహించారు. కనుల పండువగా సాగిన కల్యాణోత్సవానికి పట్టణ ప్రముఖులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో వేంకటేశ్వరస్వామి పల్లకీసేవను నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో సాయీశ్వర్‌రెడ్డి, వేములబాల్‌రాజ్, నాగిళ్లభవానీప్రసాద్, నాగిళ్లకుమారస్వామి, పాండురంగారెడ్డి, పాలాదిశివకుమార్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

అధికారి లేక.. రిజిస్ట్రేషన్లు కాక..

- ఇబ్బంది పడుతున్న భూ క్రయవిక్రయదారులు
- నిలిచిన తహసీల్ కార్యాలయ సేవలు
- తహసీల్దార్‌ను నియమించాలంటున్న ప్రజలు



తహసీల్దార్ కార్యాలయం

మాడ్గుల: ఉన్న అధికారిని బదిలీ చేశారు. ఆయన స్థానంలో మరొకరిని నియమించలేదు. కానీ.. మరో అధికారికి బాధ్యతలు అప్పగించారు. అతను సెలవులపై వెళ్లడంతో ఆ కార్యాలయ కార్యకలాపాలు పడకేసి.. ప్రజలకు ఇబ్బందిగా మారింది. మాడ్గుల తహసీల్దార్ సునీల్ రెండు నెలల కిందట కలెక్టరేట్ కార్యాలయానికి ఏఓగా బదిలీ కాగా.. ఉప తహసీల్దార్ రాజశేఖర్‌కు బాధ్యతలు అప్పగించారు. అనారోగ్యం కారణంగా ఆయన ఈ నెల 9 నుంచి సెలవుల్లో ఉన్నారు. దీంతో నాటి నుంచి రిజిస్ట్రేషన్లు నిలిచిపోగా.. పని నిమిత్తం వచ్చే ప్రజలు విషయం తెలుసుకుని వెనుదిరుగుతున్నారు. సెలవుల్లో ఉన్న అధికారి ఎప్పుడు విధుల్లో చేరతారోనన్న కచ్చితమైన సమాచారం లేక పోవడంతో చాలా మంది రిజిస్ట్రేషన్లు రద్దు చేసుకోవడం గమనార్హం.

లావాదేవిలు నిలిచిపోయాయని

తహసీల్దార్ పోస్టు ఖాళీగా ఉండటం, ఉప తహసీల్దార్ సెలవుల్లో వెళ్లడంతో పనులు కావడం లేదని ప్రజలు తెలిపారు. భూ రిజిస్ట్రేషన్ స్లాట్ బుక్ చేసుకున్నవారు, క్రయవిక్రయ దారులు రిజిస్ట్రేషన్ చేయించుకోవడానికి అవకాశం లేకుండా పోయిందని వాపోతున్నారు. క్రయవిక్రయాల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఆర్థిక లావాదేవీలు నిలిచిపోయాయని ఆవేదన చెందుతున్నారు. రిజిస్ట్రేషన్లు నిలిచి, అత్యవసరమై.. భూములు అమ్ముకున్నవారికి, కొనుగోలు చేసిన వారు సొమ్ము చెల్లించేందుకు వెనుకాడుతుండటంతో ఆర్థికంగా సతమతవుతున్నారని వెల్లడించారు. సంబంధిత అధికారులు తహసీల్దార్‌ను నియమించాలని కోరారు.

గాంధీభవన్‌కు తరలిన కాంగ్రెస్ నేతలు

కడ్తాల్: పీసీసీ అధ్యక్షుడిగా ఆదివారం బాధ్యతలు చేపట్టిన మహేశ్ కుమార్‌గౌడ్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో మండల కేంద్రం నుంచి పార్టీ శ్రేణులు గాంధీభవన్‌కు తరలివెళ్లారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. నూతన అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ నాయకత్వంలో రాష్ట్రంలో పార్టీ మరింత బలపడుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కేపీఎస్ రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, పార్టీ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, కృష్ణనాయక్, మల్లేశ్‌గౌడ్, షాబుద్దీన్ తతదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న నవరాత్రి ఉత్సవాలు

చేవెళ్ల, షాద్‌నగర్‌లోని పలు మండల కేంద్రాలు, గ్రామాల్లో గణేశ్ నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఆదివారం తొమ్మిదోరోజు ప్రత్యేక పూజల అనంతరం అన్నదానం కార్యక్రమాన్ని మండపాల నిర్వాహకులు చేపట్టారు. అక్కడక్కడ గణనాథుల లడ్డూ వేలం నిర్వహించారు. ఆసక్తి గల భక్తులు, వ్యాపారులు ఈ వేలంలో పాల్గొని లడ్డూ కైవసం చేసుకున్నారు. మరికొన్ని చోట్ల మండపాల వద్ద ప్రతిష్ఠించిన గణపతిని డప్పు చప్పుళ్లు, బ్యాండ్‌మేళా, టపాసులు కాల్చి ఆటపాటల నడుమ నిమజ్జనానికి తరలించారు. మంగళవారం చేపట్టనున్న మహా నిమజ్జనానికి మండపాల నిర్వాహకులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.



చేవెళ్ల: ముడిమ్యాల గ్రామంలో లడ్డూ ప్రసాదం దక్కించుకున్న హరికిషన్‌రెడ్డి



మొయినాబాద్ రూరల్: బాకారంలో గణనాథుడి పూజలో యూత్ కాంగ్రెస్ జిల్లా నాయకుడు ఎలిగెపల్లి శ్రీనివాస్‌యాదవ్ తదితరులు



షాబాద్: లింగారెడ్డిగూడలో పూజలో బజరంగ్ దళ్ విభాగ్ కన్వీనర్ గూడెం రమేశ్ తదితరులు



షాద్‌నగర్: న్యూసిటీ కాలనీలోని గణనాథుడి వద్ద దీపోత్సవంలో మహిళలు



చేవెళ్ల: విగ్రహాన్ని నిమజ్జనానికి తరలిస్తున్న న్యూ జర్నలిస్ట్ కాలనీ వాసులు



కొందుర్గు: దేవాలయం ఆవరణలోని కోనేరులో నిమజ్జనం చేస్తున్న రావిర్యాల గ్రామస్తులు



షాద్‌నగర్ రూరల్: అన్నదానం ప్రారంభిసున్న మాజీ సర్పంచ్ పెంటయ్య

క్లుప్తంగా

గాంధీ భవన్‌కు తరలిన నేతలు



ప్రమాణస్వీకారోత్సవానికి తరలిన కాంగ్రెస్ నాయకులతో ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్: పీసీసీ అధ్యక్షుడిగా ఎన్నికైన బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ ప్రమాణ స్వీకారోత్సవానికి ఆదివారం స్థానిక కాంగ్రెస్ నాయకులు హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌కు తరలివెళ్లారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో భారీ ఎత్తున నేతలు వాహనాల్లో వెళ్లారు. బాబర్‌ఖాన్, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, రఘు, కృష్ణారెడ్డి, హరినాథ్‌రెడ్డి, పురుషోత్తం రెడ్డి, దంగు శ్రీనివాస్ యాదవ్, తదితరులు ఉన్నారు.

టీషర్టుల పంపిణీ



టీషర్టులు పంపిణీ చేస్తున్న షాబుద్దీన్ తదితరులు

కడ్తాల్: చవితి ఉత్సవాలను పురస్కరించుకుని మక్తమాదారం గ్రామంలో నేను సైతం యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు షాబుద్దీన్ ఉత్సవ నిర్వాహకులకు టీ షర్టులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా షాబుద్దీన్ మాట్లాడుతూ కుల మతాలకతీతంగా జరుపుకొనే వేడుకల్లో భాగస్వామ్యం కావడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు బాలరాజు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మనాయక్, లక్పతినాయక్, సత్యం, నర్సింహగౌడ్, నారాయణ, శ్రీకాంత్, శేఖర్, మల్లేశ్ తదితరులు ఉన్నారు.

గ్రామాలకు లింకురోడ్లు వేయండి



ఎమ్మెల్యే కసిరెడ్డిని కోరిన కాంగ్రెస్ నేతలు

తలకొండపల్లి: మండల పరిధి గ్రామాల్లో లింక్ రోడ్లు వేయాలని కాంగ్రెస్ సీనియర్ నేత, శతాబ్ది టౌన్‌షిప్ మేనేజింగ్ డైరెక్టర్ కాస్ శ్రీనివాసు రెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన పలువురు నాయకులతో కలిసి ఆదివారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పలు గ్రామాల్లో సీసీరోడ్లు, అండర్ డ్రైనేజీలు, మురుగు కాల్వలు, కమ్యూనిటీ భవనాలు తదితర వాటి నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి, సీనియర్ నేత బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

ఆమనగల్లు: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఆమనగల్లు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత కంటి వైద్య చికిత్స శిబిరం నిర్వహిస్తామని లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు పసుల లక్ష్మారెడ్డి, పీఆర్‌ఓ పాషాలు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా నేత్ర సమస్యలు ఉన్నవారికి పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఆపరేషన్లు చేయిస్తామని వెల్లడించారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

బీజేపీని మరింత బలోపేతం చేయండి



సభ్యత్వ నమోదులో బీజేపీ నాయకులు

మంచాల: బీజేపీని మరింత బలోపేతం చేయాలని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు దన్నె బాషయ్య పిలుపునిచ్చారు. ఆదివారం మండల పరిధి లోయపల్లి గ్రామంలో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పార్టీ శ్రేణులు సమష్టిగా పని చేయాలని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించాలని సూచించారు. ప్రజలను మరింత చైతన్య పరిచి పార్టీని బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు జంగయ్య గౌడ్, జిల్లా నాయకుడు కొండల్ ముదిరాజ్, స్థానిక నాయకులు బండి రాజు, శ్రీశైలం, వెంకటేశ్, రాజు, మహేశ్, గోపాల్ రాంచంద్రయ్య, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.